Bala Balikalaku Manchi Kathalu
(Telugu)

బాలబాలికలకు
మంచి కథలు

రచన

మఖ్బూల్ అహ్మద్ సేవ్‌హార్వి

అనువాదం

ఎం.డి. యాఖూబ్

విషయసూచిక

తొలిపలుకులు

ప్రతీ ఇంట్లో పిల్లలుంటారు. పిల్లలందరు కథలు వినడానికి తహతహలాడుతుంటారు. ముఖ్యంగా ముస్లిముల ఇళ్ళల్లో ఈ సాంప్రదాయం చాలా సంవత్సరాలనుండి కొనసాగుతూవస్తుంది. పిల్లల మనోవికాసాలకోసం మన పెద్దలు పూర్వీకుల కథలను వినిపిస్తుంటారు.

నేటి సంస్కృతి, విద్యావికాసాలలోపం పెడదారుల వల్ల ఇతర రంగాలపై చెడు ప్రభావం పడింది. అదే విధంగా కథల విషయంలోనూ ప్రభావం పడింది. అదెలాగంటే- కాల్పనిక, ఊహాజనిత కథలను వల్లిస్తూ భూతప్రేతపిశాచాల కథలను అల్లి కథా సాహిత్యాన్ని కలుషితం చేశారు. అదృష్టంకొద్దీ మౌలానా మఖ్బూల్ అహ్మద్ సేవ్‌హార్వీ గారు తమ కలంతో సామాజిక రుగ్మతలను సంస్కరిస్తూ అనేక రచనలు చేశారు. ఆయన ప్రతిభ రచనలకు ఓ నిదర్శనం ఈ చిరుపుస్తకం.

మీ పిల్లలను ఈ పుస్తకాన్ని తప్పనిసరిగా చదివించండి.

పిల్లలూ! మేము మీకు వినిపిస్తున్న కథల్లోని ప్రతీవాక్యం సత్యమైంది. చిన్న పిల్లలకు కథలు బాగా నచ్చుతాయని, కథలు ఉత్సాహంగా వింటారని, కథలు విని సంతోషపడతారని ఈ కథలు మీకు వినిపిస్తున్నాం.

\- ప్రకాశకులు

అనంతకరుణామయుడు అపార కృపాశీలుడైన అల్లాహ్ పేరుతో

బాలబాలికల కోసం
మంచికథలు

1. ప్రియ ప్రవక్త (స) హితబోధ

అల్లాహ్ ప్రియదాసులు హజ్రత్ ముహమ్మద్ (స) మక్కా నగరంలో జన్మించారు. ఆ సమయంలో ఎవరో ఒకరిద్దరు తప్ప మక్కావాసులలో మిగతా వారందరూ రాళ్లను పూజించేవారు. వారు రాళ్లను విగ్రహాలుగా మలుచుకుని ఉంచుకునేవారు. తమకు ఏదైనా అవసరం వస్తే విగ్రహం ముందు చేతులు కట్టుకుని నిలుచొని "మేము ఆపదలో ఉన్నాము, మా ఆపదను తొలగించు. మేము బీదవారమయ్యాము మాకు ధనాన్ని ప్రసాదించు. మా పంటపొలాల్లో అధిక దిగుబడులను ప్రసాదించు" అని వేడుకునేవారు.

మక్కా నగరవాసుల ఈ వింత ప్రవర్తన ప్రవక్త (స) గారికి నచ్చేది కాదు.

ప్రవక్త (స) గారి హృదయంలో అల్లాహ్ 'వీరిని ఎలాగైనా విగ్రహారాధన నుండి ఆపాలి' అనే భావనను సృజించాడు.

ప్రవక్త (స) అందరికన్నా ముందు తన కుటుంబ సభ్యులను, ఆ తర్వాత నగర ప్రజలను విగ్రహారాధన చేయకూడదని వారించారు. నగర ప్రజలు ప్రవక్త (స)కు శత్రువులయ్యారు. అదను దొరికినప్పుడల్లా అందరూ ప్రవక్త (స)ను గేలిచేసేవారు. హింసించేవారు. వీలు చిక్కితే ప్రాణాలు తీయటానికి కూడా కాచుకుని ఉండేవారు.

మక్కా నగరంలో సజ్జనులైన కొందరు విగ్రహారాధనను విడిచిపెట్టి ప్రవక్త (స) బోధనలను వినసాగారు: ఆయన ప్రబోధన 'అల్లాహ్ ఒక్కడే. ఆయనకు ఎవరూ భాగస్వాములుకారు' ఈ విషయం మిగతా వారికి మింగుడు పడలేదు. అలా వారు ప్రవక్త (స)తో శత్రుత్వాన్ని పెంచుకున్నారు.

మక్కా నగరవాసుల తాత ముత్తాతలు విగ్రహాలను పూజించేవారు. తరతరాల నుండి వస్తున్న ఈ సాంప్రదాయాన్ని వారు ఎలా వదులుకుంటారు!

పరిస్థితులు మరీ దారుణంగా తయారయ్యాయి. ప్రవక్త (స) కుటుంబ సభ్యులు నగరవాసులు ఆయనకు ప్రాణశత్రువులయ్యారు. అందువల్ల ప్రవక్త (స) తన స్వదేశమైన మక్కాను వదలిపెట్టాల్సి వచ్చింది. రాత్రికి రాత్రే శత్రువుల నుండి తప్పించుకుని వేరే ప్రాంతానికి తరలి వెళ్లి పోయారు. ఆ ప్రయాణంలో ప్రవక్త (స)తోపాటు ఆయన మిత్రులైన అబూబక్ర్ (రజి) కూడా ఉన్నారు.

ఇద్దరూ మక్కా నగరం నుండి కొంత దూరం వెళ్ళి అక్కడ పర్వత గుహలో తలదాచుకున్నారు. ఆ పర్వత గుహ పేరే 'సవర్ గుహ'.

2. మదీనా ప్రయాణం

శత్రువులు ప్రవక్త(స) ఇంటిని చుట్టుముట్టారు. కాని ప్రవక్త(స) తన ఇంటినుండి బయటకు వెళ్ళేటప్పుడు వారి కళ్ళు బైర్లు కమ్మాయి. శత్రువులెవరూ ఆయన్ను చూడలేకపోయారు.

ప్రవక్త(స) ఆయన స్నేహితుడు అబూబక్ర్(రజి) పగలంతా ఆ గుహలోనే తలదాచుకున్నారు. చీకటి పడగానే గుహనుండి బయటపడి మదీనా నగరానికి పయనమయ్యారు.

అటు శత్రువులు ఏం చేశారో చూడండి....

ఉదయం వారికి ప్రవక్త(స) కనబడకపోయేసరికి చిర్రుబుర్రు లాడారు. ప్రవక్త(స) మంచంపై ఆయన బాబాయ్ కొడుకు అలీ(రజి) దుప్పటి కప్పుకుని పడుకొని ఉన్నారు. ఆయన్ను లేపి ప్రవక్త(స) గురించి వాకబు చేశారు. కాని వారికి ప్రవక్త(స) గురించి ఎలాంటి సమాచారం లభించలేదు. అప్పుడు మక్కా నాయకులు 'ముహమ్మద్(స)ను పట్టుకు తెచ్చినవారికి నూరు ఒంటెలు బహుమతిగా ఇస్తామని' ప్రకటించారు.

ప్రవక్త(స)ను వెంబడించడానికి ఎవరికి తీరిక ఉందిగనుక?! అయితే ఒక అత్యాశపరుడు మాత్రం 'నేను ముహమ్మద్(స)ను పట్టుకొని తెస్తాను' అని విర్రవీగాడు. అతని పేరు సురాఖ. సురాఖ క్షణం ఆలస్యం చేయకుండా ప్రవక్తను పట్టితేవడానికి గుర్రంపై బయలు దేరాడు. ఎట్టకేలకు ప్రవక్త(స) వెళ్ళిన దారిని అతను కనుక్కున్నాడు. ప్రవక్త(స)ను సమీపిస్తుండగా, అతని గుర్రంకాళ్ళు భూమిలో దిగబడ్డాయి. అంతే! ఇక అతను ఒక్క ఇంచు ముందుకు కదల్లేకపోయాడు. అప్పుడు సురాఖ ఇలా ఆలోచించసాగాడు; 'ముహమ్మద్(స)లో ఏదో మహిమ ఉంది. అందుకే ఆయన నగరంలో పెద్దపెద్ద వారికి సైతం భయపడకుండా అల్లాహ్ ఒక్కడే, విగ్రహారాధన చేయకండి' అని నిర్భయంగా చెప్పగలిగారు. కాబట్టి ఈయన్ను ఇక వెంబడించకూడదు అనుకున్నాడు సురాఖ మనసులో. అతను అలా అనుకుంటుండగానే గుర్రం కాళ్ళు భూమినుంచి వెలుపలికి వచ్చాయి.

ప్రవక్త(స), ఆయన ప్రియ సహచరి మదీనా నగరానికి చేరుకున్నారు.

3. ఆనంద సంబరాలు

ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) సొంత ప్రదేశాన్ని, మక్కా నగరంలోని తన ఇల్లూవాకిలిని విడిచిపెట్టి మదీనా నగరంలో నివసించడానికి వస్తున్నారని మదీనా వాసులకు ముందే సమాచారం అందింది. మదీనావాసులు చాలా మంచివాళ్ళు. అక్కడి ప్రతి వ్యక్తీ మంచివాడే.

ప్రవక్త (స) మదీనా నగరానికి వస్తున్నారని తెలుసుకున్న మదీనావాసులు రోజూ నగరం పొలిమేరలదాకా వచ్చి తమ అతిథి వస్తున్నాడో? లేదో? చూసి వెళ్ళిపోయేవారు.

చివరకు ఇద్దరు మిత్రులు ప్రవక్త (స), అబూబక్ర్ (రజి) మదీనా చేరుకున్నారు. మదీనావాసులు సంతోషంతో వారిని తమ నగరంలోకి ఆహ్వానించారు. చిన్నచిన్న పిల్లలు డప్పువాయిస్తూ గేయాలు పాడసాగారు.

'మా ప్రియ అతిథి మంచివాడు, గొప్పవాడు
చూడండి... చూడండి వచ్చాడు
ఖుర్‌ఆన్ అనుగ్రహం తెచ్చాడు
సత్యమైన ఖుర్‌ఆన్ అది, యదార్థమైనది, నిజమైనది
అనండి అందరూ అల్లాహు అక్బర్,
అల్లాహ్ అందరికంటే గొప్పవాడు, ఉన్నతుడు
అందరికంటే శ్రేష్ఠుడు, అత్యున్నతుడు
అతని ప్రతిమాట అపూర్వమైనది
మా మంచి ఖుర్‌ఆన్
మా మంచి అతిథి
మేమందరం అతనికి అంకితం.'

4. సత్యం జయించింది

ప్రవక్త (స) మదీనా చేరుకున్నారనీ, మదీనా నగరవాసులు ఆయన (స)ను సాదరంగా ఆహ్వానించారని తెలుసుకున్న మక్కా వాసులు కోపంతో మండిపడ్డారు. మదీనావాసులపై దండయాత్ర చేయడానికి పూనుకున్నారు.

మక్కావాసులకు దేనికీ కొదవలేదు. వెయ్యి మంది సైనికులను, వంద మంది గుర్రపు రౌతులను గొప్ప యుద్ధవీరులను పరాక్రమవంతులను వెంట తీసుకుని మదీనాపై దాడి చేయడానికి బయలుదేరారు.

ఈ విషయం (ప్రవక్త (స) గారికి తెలిసింది. మదీనా నగర వాసులందరినీ సమావేశపరిచారు. వారి అభిప్రాయం ఏమిటో అడిగారు. ప్రవక్త (స) సహచరులు ముక్తకంఠంతో తాము పోరాటానికి సిద్ధమేనన్నారు. ఇక మదీనా నగరవాసుల అభిప్రాయం కోసం వేచి ఉన్నారు ప్రవక్త (స). 'ఓ ప్రవక్తా, తమరు ఆజ్ఞాపించండి చాలు మీరు దూకెయ్యమంటే సముద్రంలోకి దూకటానికయినా మేము సిద్ధం. చస్తే ఒకేసారి చస్తాం చావంటే మాకు భయంలేదు' అని మదీనావాసులు ధైర్యంగా బదులిచ్చారు.

మదీనా నుండి ప్రవక్త (స) సైనికులను తీసుకుని బయలుదేరారు. కేవలం మూడొందల పదమూడు మందే ఉన్నారు.

అటు శత్రువులు వాహనాల సమేతంగా రణభూమికి వస్తున్నారు. వారి వద్ద వంద గుర్రాలున్నాయి. ప్రవక్త (స) సహచరుల వద్ద కేవలం రెండు గుర్రాలే ఉన్నాయి. యుద్ధ సామాగ్రి కూడా పూర్తిగా లేదు. ఖడ్గముంటే ఈటెలుండేవి కావు. ఈటెలుంటే ఖడ్గాలు ఉండేవి కావు. అయి

నప్పటికీ సత్యం కోసం జరిగింది ఈ యుద్ధం. తెల్లవారగానే రణభేరి మ్రోగింది. యుద్ధం జరిగింది. ఈ యుద్ధంలో 70 మంది శత్రువులు నేల కొరిగారు. ప్రవక్త (స) సహచరులు 14 మంది వీర మరణం పొందారు.

రేపు యుద్ధం జరుగు తుందనగా ఆ రోజు రాత్రి శత్రువులంతా ఎంతో విలాసంగా గడిపారు. జల్సా చేసుకున్నారు.

కాని మరోవైపు ప్రవక్త (స) రాత్రంతా ప్రార్థనలు చేస్తూ గడిపారు. ఎప్పుడయితే అల్లాహ్ ఆయన హృదయంలో శత్రువులు ఓడిపోతారు, మీ సహచరులు గెలుస్తారు. అనే ఆలోచన కలిగించాడో అప్పుడు ప్రవక్త (స)కు కొంచెం ఊరట కలిగింది.

ఇక ఏం చెప్పమంటారు. కాకలు తీరిన యుద్ధ వీరులు నేలకొరగడంతో కొందరు సైనికులు బ్రతుకు జీవుడా అంటూ పరుగు లంఘించారు. తెచ్చుకున్న సామాన్లు ఎక్కడివి అక్కడే వదిలి పరుగులు తీశారు. చనిపోయిన వారి శవాలు తీసుకెళ్లకుండానే యుద్ధ మైదానం నుండి పారిపోయారు.

శవాలు సామాన్లు యుద్ధభూమిలో అలానే పడి ఉండిపోయాయి.

అల్లాహ్ తన ప్రియదాసుడైన ముహమ్మద్ (స)కు ఈ విషయమే తెలిపాడు. "మీరు భయపడకండి శత్రువులు ఘోరంగా ఓడిపోతారు. యుద్ధ మైదానం నుండి భీతిల్లి వెనక్కు చూడకుండా పారిపోతారు."

5. బంగళాలో జరిగిన ఒప్పందం

పారిపోయిన శత్రుసేనలు మక్కా చేరుకున్నారు. తమతమ ఇండ్లల్లో తలదాచుకున్నారు. యుద్ధంలో తల్లిదండ్రులను, అన్నదమ్ముల్ని కోల్పోయిన వారి పరిస్థితి తేలుకుట్టిన దొంగలా మారింది. అంటే జనం తమ మీద నవ్విపోతారేమోనని భయంతో ఏడ్వడం కూడా మానేశారు.

"గుప్పెడు మంది సైనికులతో కూడా పోరాడలేకపోయారు. అదీ గాక మనవాళ్ళ శవాలను, వస్తుసామాగ్రిని కూడా యుద్ధ మైదా నంలోనే వదిలిపెట్టి వచ్చేశారు. యుద్ధానికి బయలుదేరక ముందే ముహ మ్మద్(స)తో కడదాకా పోరాడతామని ప్రగల్భాలు పలికారు కదా..! ఇప్పుడే మయింది'' అని జనం తలోమాట అంటారని దుఃఖాన్ని, బాధను లోలోపలే దిగమ్రింగుకోవలసి వచ్చింది మక్కా ఖురైషులకు.

ఒకరోజు ఏం జరిగిందంటే... ఉమైర్, సఫ్వాన్ అనే ఇద్దరు ఇస్లాం శత్రువులు ఒక బంగళాలో కూర్చుని మాట్లాడుకోసాగారు. ఉమైర్ కొడుకు యుద్ధానికి వెళ్ళాడు. యుద్ధంలో ఓడిపోయి పట్టుబడ్డాడు.

సఫ్వాన్ ఇలా అన్నాడు: ఉమైర్! ఇక మనం బతికి లాభ మేంటి?!

అబ్దుల్లా కుమారుడు ముహమ్మద్ కాకలు తీరిన మన యుద్ధ వీరులను మట్టి కరిపించాడు. అతని సైన్యం ధాటికి కండలు తిరిగిన వీర యోధులు సైతం పలాయనం చిత్తగించారు. అసలు ఎంత విడ్డూరమో చూడు!

మన సైన్యం అధికంగా ఉంది. మన దగ్గర యుద్ధ సామాగ్రి కూడా చాలా ఎక్కువగానే ఉంది. కాని ఏం జరిగింది..?? మనవాళ్ళు యుద్ధ మైదానం నుండి వెనక్కి తిరిగి చూడకుండా పారిపోయి వచ్చారు.

ఇదంతా చెబుతూ, 'అయ్యో! ఎంత ఘోరం జరిగింది' అని విచారం వ్యక్తం చేశాడు సఫ్వాన్.

ఏం చెప్పమంటావు.... నాకైతే ముహమ్మద్ (స)ను ప్రాణాలతో వదలిపెట్టాలని లేదు. కాని ఏం చేయను? ఒక వైపు రుణభారంతో నలిగిపోతున్నాను.. ఏం చేయాలో, రుణం ఎలా తీర్చాలో అర్థం కావడం లేదు? అని ఉమైర్ అసహనం వ్యక్తం చేశాడు.

సఫ్వాన్ అతన్ని రెచ్చగొడుతూ 'నీకు ఆ చింత అక్కర్లేదు. నీకు తోడుగా నేనున్నాను. నువ్వు ఎవరెవరి దగ్గర అప్పు చేశావో చెప్పు.... వెంటనే తీర్చేస్తా. నువ్వెళ్ళి నీ పని పూర్తి చేసుకునిరా..'' అని ఉమైర్‌కు ఉచిత సలహా ఉదారంగా ఇచ్చాడు.

ఉమైర్ ఇంటికెళ్ళి ఖడ్గం తీసుకుని మదీనాకు బయలు దేరాడు. మదీనా చేరుకున్నాడు. అక్కడ ప్రవక్త (స) మిత్రులైన ఉమర్ (రజి) అతన్ని చూసి అతను 'ఉమైర్' అని గుర్తుపట్టారు. అతన్ని మెడ పట్టుకుని ప్రవక్త (స) వద్దకు తీసుకెళ్ళి, ఇతనే ఉమైర్. శత్రు సైన్యాన్ని పురికొల్పేవాడు ఇతనే'' అని ప్రవక్త (స) ముందు అతన్ని హాజరు పర్చారు.

'ఉమైర్ నన్నేమీ చేయలేదు, అతన్ని విడిచిపెట్టండి' అన్నారు ప్రవక్త (స).

'ఏంటీ నీ ఉద్దేశం?' అని నిలదీశారు.

'నా కుమారుడిని విడిపించుకోవడానికి వచ్చాను. ఖడ్గం ఊరికే వెంట తెచ్చుకున్నాను. సైనికుడి దగ్గర ఖడ్గం లేకపోతే అతన్ని సైనికుడని ఎవరంటారు' అని సమాధానమిచ్చాడు ఉమైర్.

'మరి బంగళాలో నీకూ, సఫ్వాన్‌కు మధ్య జరిగిన ఒప్పందం సంగతేంటి?' అని ప్రశ్నించారు ప్రవక్త (స).

అది విన్న ఉమైర్‌కు గొంతులో పచ్చివెలక్కాయ ఇరుక్కున్నట్ట యింది. తత్తరపాటుతో బిత్తరచూపులు చూడసాగాడు. చివరకు ఇలా విన్నవించుకున్నాడు:

'నిశ్చయంగా అల్లాహ్ మీకు ఈ విషయం గురించి తెలిపి ఉంటాడు. మీరు నిజంగా దైవప్రవక్త అని నేను నమ్ముతున్నాను. విశ్వసిస్తున్నాను. ఇక నుండి విగ్రహాలను పూజించను. వారి ముందు చేయి చాచను. కేవలం ఒక్కడైన అల్లాహ్‌నే ఆరాధిస్తాను. ఆయన ముందే చేయి చాచుతాను. బంగళాలో నేనూ, సఫ్వాన్ మాత్రమే ఉన్నాము. అయినప్పటికీ ఆ విషయం మీకు తెలిసిందంటే- మీలో ఏదో మహిమ ఉందని నేను తెలుసుకున్నాను. మీరు అల్లాహ్ ప్రియ దాసులు. మహోన్నతులు.

అటు.... మక్కాలో సఫ్వాన్ ఉమైర్ కోసం ఎంతో ఆశతో ఎదురు చూడసాగాడు. కాని ఉమైర్ ముస్లిం అయ్యాడని, ప్రవక్త (స) సహచరుడయ్యాడని తెలిసినప్పుడు అతని హృదయం కసితో రగిలిపోయింది.

6. చిన్ని

అది సాయంత్రం వేళ. సూర్యుడు అస్తమించే సమయం. ప్రవక్త (స) బయలుదేరారు. ఆయన వెంట ఆయన సహచరుడు అబూహురైరా (రజి) కూడా ఉన్నారు. ఇద్దరూ కలిసి ఫాతిమా (రజి అన్హా) ఇంటికి వెళ్ళారు.

ఫాతిమా (రజి అన్హా) ఎవరో మీకు తెలుసుకదా!

ప్రవక్త (స) ప్రియకుమార్తె ఫాతిమా (రజిఅన్హా).

ప్రవక్త (స), అబూహురైరా (రజి) ఫాతిమా (రజి అన్హా) ఇల్లు చేరుకుని ఇంటి ప్రాంగణంలో కూర్చున్నారు.

ప్రవక్త (స) ఫాతిమా (రజి అన్హా)ను చిన్ని ఎక్కడున్నాడు? అని అడిగారు.

ఇంతలోనే చిన్ని చెంగుచెంగునా పరుగెత్తుకుంటూ వచ్చాడు. ప్రవక్త (స) అతన్ని హృదయానికి హత్తుకుని ఇలా ప్రార్థించారు:

'ఓ అల్లాహ్! చిన్నిని ప్రేమించు. నా ఈ చిన్నిని ప్రేమించే వారినీ ప్రేమించు.'

ఇప్పటికైనా తెలిసిందా ఆ చిన్ని ఎవరో?

అదేనండి.... ఫాతిమా (రజి అన్హా) గారాల పుత్రుడు.

'హసన్' ఆయన పేరు. మంచి పేరు కదా!!

సౌందర్యవంతుడు.... మంచివాడు కూడాను...

7. పనివాడూ మనవాడే!

అబూజర్ గిఫ్ఫారి ప్రవక్త (స)కు మంచి మిత్రులు. ఆయన ప్రవక్త (స)ను బాగా ఇష్టపడేవారు. విధేయులు కూడాను.

ఒకరోజు అబూజర్ గిఫ్ఫారి (రజి) తన పనివాడి మీద ఆగ్రహం వ్యక్తం చేశారు. కోపంతో 'ఒరె నీగ్రో! (నల్లోడా)' అన్నారు. పనివాడి తల్లి అబిసీనియా దేశంలో ఉండేది. నల్లగా ఉండేది. ప్రవక్త (స) అబూజర్ గారి ఆ మాట విని ఇలా అన్నారు: 'అబూజర్! నువ్వు ఇలాంటి మాట లంటావేమిటి? నువ్వు ఎలాంటివాడివో నీ పనివాడూ అలాంటివాడే. నువ్వూ ముస్లిం, నీ పనివాడు ముస్లిమే. ముస్లింలు పరస్పరం సోదరు ల్లాంటివారు, సమానులు. ఒక సోదరుణ్ణి మరో సోదరుడు ఇలా అంటాడా? ఇలా ప్రవర్తించకు. పనివాళ్ళతో మంచిగా వ్యవహరించు. వారికి బాధ కలిగే విధంగా మాట్లాడకు.'

అబూజర్ అప్పటి నుండి ఇంకెప్పుడూ తన పనివాళ్ళ పట్ల అలా దురుసుగా ప్రవర్తించలేదు. మరణించేంత వరకు తన నౌకర్లను బాగా చూసుకున్నారు.

ప్రవక్త (స) తన పనివారిపట్ల, నౌకర్ల పట్ల ఎప్పుడూ కఠినంగా వ్యవహరించేవారు కాదు.

8. దుఆ ప్రభావం

ప్రవక్త (స) బాబాయ్‌లలో అబూతాలిబ్ ఒకరు. ప్రవక్త (స)ను పెంచి పోషించింది ఈయనే. ప్రవక్త (స)కు వివాహం చేసింది కూడా ఈయనే.

ఒకసారి అబూతాలిబ్ అనారోగ్యంతో చాలా బాధపడసాగారు. ప్రవక్త (స) బాబాయిను పరామర్శించడానికి వెళ్ళారు. అబూతాలిబ్ ప్రవక్త (స)ను చూసి 'అల్లాహ్ నీ మాట వింటాడు కదా, నేను త్వరగా కోలుకోవాలని అల్లాహ్‌ను ప్రార్థించు' అన్నారు. ప్రవక్త (స) బాబాయి కోసం చేతులెత్తి అల్లాహ్‌ను ప్రార్థించారు.

అల్లాహ్ కారుణ్యంతో అబూతాలిబ్ కోలుకున్నారు.

ప్రవక్త (స) తన బాబాయ్‌తో 'బాబాయ్! నువ్వు కూడా అల్లాహ్ మాటవింటే అల్లాహ్ కూడా నీ మాట వింటాడు' అన్నారు.

9. చతురోక్తి

ఒకసారి ఒక ముసలావిడ ప్రవక్త (స) దగ్గరకు వచ్చింది. ప్రవక్త (స)ను 'ముసలివారు స్వర్గానికి వెళతారా? స్వర్గ వసంతాలు, ఎత్తయిన మేడలు, పెద్దపెద్ద బంగళాలు, పచ్చని తోటలు, తాజా పండ్లు ముసలివారికి లభిస్తాయా?' అని అడిగింది.

'బామ్మా! ముసలివారు స్వర్గానికి వెళ్ళరు కదా!' అని బదులిచ్చారు ప్రవక్త (స).

ఆ ముసలావిడ ప్రవక్త (స) మాటవిని బాధపడి పోయింది. అప్పుడు ప్రవక్త (స) 'బామ్మా! ఎందుకు విచారిస్తున్నావు. ముసలివారు స్వర్గానికి వెళతారు, కాని యువకులుగా మారి వెళతారులే' అన్నారు.

ఈ మాటవిని ఆ బామ్మ పెద్దగా నవ్వింది. సంతోషంతో ఇంటికి వెళ్ళిపోయింది.

10. మృదువాక్కు

ఒకసారి ప్రవక్త (స) ఒక షావుకారు దగ్గర అప్పు తీసుకున్నారు. అప్పు చెల్లించే సమయం ఇంకా ఉన్నా షావుకారు సమయానికి ముందే వచ్చి అప్పు అడగసాగాడు. నోటికొచ్చినట్టు వాగసాగాడు.

షావుకారు అనవనర ఆగ్రహాన్ని చూసిన ప్రవక్త (స) అనుచరులొకరు అతన్ను గద్దిస్తూ, 'అప్పు అడగడానికి వచ్చావా? లేక పోట్లాటకొచ్చావా? ఒక దెబ్బకొడితే నేలక్కతుక్కుంటావ్, ఏమనుకుంటున్నావో?' అన్నారు.

అప్పుడు ప్రవక్త (స) కల్పించుకుని 'ఇవ్వాల్సిన వారికి ఇవ్వక తప్పదు కదా! ఎందుకు అనవసరంగా అతని మీద నోరు పారేసు కుంటావు' అని తన సహచరుణ్ణి సముదాయించారు.

తర్వాత ఆ షావుకారు వైపు తిరిగి 'నీ అప్పు తీసుకో' అంటూ అతను ఇచ్చిన అప్పుకంటే కొంత ఎక్కువగానే ఇచ్చారు ప్రవక్త (స).

ప్రవక్త (స)గారు కోపగించుకోకుండా మృదువుగా, మెల్లగా మాట్లాడే తీరు చూసి షావుకారు తన తప్పుని గ్రహించాడు. కలిమా పఠించి ముస్లిం అయ్యాడు. ప్రవక్త (స) అనుచరుడయ్యాడు.

11. రుణగ్రస్తులతో దురుసుగా ప్రవర్తించకండి

ఒక షావుకారు ఉండేవాడు. అతను చాలా ధనవంతుడు. అతని దగ్గర చాలా ధనం ఉండేది. వెండి, బంగారం ఉండేది. పనిచేసి పెట్టడానికి బోలెడు మంది సేవకులు కూడా ఉండేవారు.

ఆ షావుకారు ఎప్పుడూ సేవకులకు ఇలా చెప్పేవాడు. "నా దగ్గర రుణం తీసుకున్నవారిని మీరు ఇబ్బంది పెట్టకండి. ఒకవేళ వారే స్వయంగా మిమ్మల్ని పిలిచి రుణం ఇస్తే తీసుకోండి. అంతే తప్ప మీరు మాత్రం మాటిమాటికీ వారిని అప్పు అడిగి విసిగించకండి. దారిలో ఎప్పుడైనా నా దగ్గర రుణం తీసుకున్న వారు కనబడితే వారిని చూసీ చూడనట్లు మీ దారిన మీరు వెళ్ళిపోండి. దారిలో వారిని అప్పు అడిగి బాధ పెట్టకండి" అని.

కొన్నిరోజుల తర్వాత ఆ షావుకారు మరణించాడు. అల్లాహ్ అతన్ని స్వర్గానికి పంపాడు. అక్కడ అతనికి పెద్దపెద్ద వెండీ, బంగారపు భవంతులు ఇవ్వబడ్డాయి. ఆ షావుకారు ఆ భవంతులలో ప్రశాంత జీవితం గడపసాగాడు. స్వర్గంలో అతనికి కోరుకున్న వస్తువు లభించింది. చల్లని పానకం, తియ్యని రసం, పెద్దపెద్ద గింజలున్న దానిమ్మ కాయలు, ద్రాక్షా, ఆపిల్, నారింజ వంటి తాజా పండ్లు లభించాయి. ఈ సంఘటన ప్రవక్త (స) గారు చెప్పారు.

12. ఇతరుల క్షేమం కోరండి

ఒక వ్యక్తి ఉండేవాడు. అతను వెళ్తున్నప్పుడు దారిలో ముళ్ళు, అరటి తొక్కలు, రాళ్ళు, ఇటుకలు వంటి హానికర వస్తువులు కనబడితే వాటిని తీసి దూరంగా పడేసేవాడు. వాటిని తొలగించే టప్పుడు 'ముళ్ళు ఎవరికాలికైనా గుచ్చుకుంటే వారికి బాధ కలుగు తుంది. ఎవరయినా అరటి తొక్కలపై కాలేస్తే జారి క్రిందపడిపోతారు. రాళ్ళు తగిలి గాయాలు కావచ్చు. వీటివల్ల వారికి బాధకలగ వచ్చు' అని ఎప్పుడూ ఇతరుల క్షేమం కోరేవాడు.

అతని ప్రవర్తన చూసి అల్లాహ్ చాలా సంతోషపడ్డాడు. ఆ వ్యక్తి చనిపోయిన తర్వాత అల్లాహ్ అతని పాపాలన్నీ క్షమించి, అతనికి స్వర్గం ప్రసాదించాడు. అతను స్వర్గ సుఖాలను చూసి ఆనంద పారవశ్య మయ్యాడు. పరవళ్ళు తొక్కుతున్న ప్రవాహాలు, ఫలాలతో నిండిన వృక్షాలు, చల్లటి గాలివీచినప్పుడుల్లా స్వర్గమంతా ఫలాల సువాసనతో పులకించిపోయే సుందర వనాలూ, అపురూప భవనాలు, అందులో సర్వాంగ సుందరంగా ముస్తాబైన గదులు.

అందమైన పక్షులు. అవి ఎగిరినప్పుడల్లా రెక్కల రాపిడితో ఝూంకార నాదం వినిపిస్తుంది. అవి కొమ్మలపై తిరుగుతూ తచ్చాడు తున్నప్పుడల్లా దానివల్ల నలువైపుల నుండి పక్షుల కిలకిల రావాలు.

'స్వర్గస్థులారా! మీరు క్షేమంగా ఉండాలి. మీరు పవిత్రులు. ఇక మీరు భయపడాల్సిన అవసరం లేదు. చింత చెందాల్సిన అవసరమూ లేదు. స్వర్గ అనుగ్రహాలన్నీ మీకొరకే.'

سَلَامٌ عَلَيْكُمْ طِبْتُمْ فَادْخُلُوهَا خَالِدِينَ

'సలామున్ అలైకుమ్ తిబ్తుమ్ ఫద్ఖులూహాఖాలిదీన్'

ఇది సృష్టికర్త ప్రసాదితం, మీరు చేసిన స్వల్పకార్యాలకు అదిరి పోయే ప్రతిఫలం అందించాడు. అతనికి ఎవరి ఆచరణ నచ్చినా వారికి పూర్తి ప్రతిఫలం ఇచ్చేస్తాడు.

13. అల్లాహ్ ప్రసాదిత శక్తి

బద్ర్ సమరం గురించి మీరు ఇంతకుముందే చదివారు. ఆ సమరంలో ఒక మక్కా సర్దారు కూడా పాల్గొన్నాడు. 'ఉబై' అతని పేరు. తండ్రి పేరు 'ఖలఫ్'. పూర్తిపేరు 'ఉబై బిన్ ఖలఫ్.'

మక్కావాసులు బద్ర్ యుద్ధంలో ఓడిపోయి పారిపోతుంటే ప్రవక్త (స) అనుచరులు వారిని పట్టి బంధించారు. వారిలో ఉబై బిన్ ఖలఫ్ ఒకడు. అతన్ని కూడా పట్టుకుని మదీనా నగరానికి తీసు కెళ్ళారు.

సుమారు వెయ్యి మంది మక్కావాసులు, మదీనాపై యుద్ధం చేయాలని బయలుదేరారు. మార్గమధ్యంలో ప్రతిసర్దారు పది ఒంటెలు కోసి అందరికీ విందు ఇచ్చేవాడు. విందు ఇచ్చే సర్దారుల్లో ఉబై, అతని అన్నయ్య ఉమయ్య బిన్ ఖలఫ్‌లు కూడా ఉన్నారు.

మదీనా చేరుకున్నాక పట్టుబడిన బందీల నుండి కొంత ధనం తీసుకుని విడిచిపెడదామని ప్రవక్త (స) అనుచరులు నిర్ణయించారు. ఉబై కూడా కొంత ధనం ఇచ్చి విముక్తుడయ్యాడు.

ఉబై బిన్ ఖలఫ్ వెళ్తూ వెళ్తూ ' నా దగ్గర ఒక గుర్రం ఉంది. ప్రతిరోజూ దానికి నేను జొన్నలు తినిపిస్తున్నాను. అది జొన్నలు తిని నుష్టుగా తయారయింది. దాని ద్వారానే నేను ప్రతికారం తీర్చు కుంటాను. ముహమ్మద్ (స)ను చంపుతాను'' అని అరుస్తూ వెళ్ళి పోయాడు.

బద్ర్ యుద్ధానంతరం ముస్లింలకు , మక్కా ముష్రిక్కులకు మధ్య మరో యుద్ధం జరిగింది. దాని పేరే 'ఉహుద్'.

ఉహుద్ యుద్ధంలో ఇరువైపుల సైనికులు పోరాటంలో లీనమై ఉండగా ఉబై బిన్ ఖలఫ్ సైనికులను చీల్చుకుంటూ అదే

గుర్రంపై ప్రవక్త (స)ను సమీపిస్తున్నాడు. ప్రవక్త (స) అనుచరులు అతన్ని ఆపడానికి ప్రయత్నిస్తే ప్రవక్త (స) అతన్ని ఆపొద్దని సైగ చేశారు. ప్రవక్త (స) స్వయంగా ఒక సైనికుని ఈటె తీసుకుని ఒక్క డుగు ముందుకేసి అతని మెడలో గుచ్చారు. ఈటె మొన తగలగానే ఉబై దిక్కులు పిక్కటిల్లేలా అరిచాడు. ఆ అరుపు విని ఒకతను 'ఏమిటి ఇంతలా అరుస్తున్నావు? చిన్న దెబ్బేకదా నీకు తగిలింది' అని ఆశ్చర్యంతో అడిగాడు.

దానికి ఉబై 'నీ మతిపోయిందా? ఆ దెబ్బకొట్టిందెవరో తెలుసా? ముహమ్మద్ (స)', ప్రవక్త (స)బలం అల్లాహ్ ప్రసాదించిన శక్తి అన్నాడు మూలుగుతూ.

14. పక్షి పిల్లలను గూట్లో పెట్టు

ప్రవక్త (స) తన మిత్రులతో ఒకచోట కూర్చుని ఉన్నారు. ఇంతలో ఒకతను కొన్ని పక్షిపిల్లలను ఒక దుప్పటిలో చుట్టుకుని తీసుకొచ్చాడు. అతను ప్రవక్త (స) దగ్గరకు వచ్చి, 'ఓ ప్రవక్తా! అక్కడ చెట్టు గూట్లో పక్షి పిల్లలున్నాయి. వాటిని దుప్పట్లో చుట్టి తీసుకొచ్చాను. నేను వాటిని దుప్పట్లో చుట్టేటప్పుడు తల్లి పక్షిలేదు. అప్పుడే వచ్చింది పిల్లల అరుపుల శబ్దం విని అది నా తలపై చుట్టూ తిరిగసాగింది. అప్పుడు నేను దుప్పటి ఒక వైపు తెరిచాను. ఆ పక్షి ఒక్క ఉదుటున పిల్లల దగ్గరకొచ్చింది. వెంటనే దాన్నికూడా దుప్పట్లో చుట్టేశాను' అని చెప్పాడు.

అది విని ప్రవక్త (స) ఇలా హితోపదేశం చేశాడు: అలా ఎందుకు చేశావు. తల్లిప్రేమ ఆ పక్షిని తన పిల్లల దగ్గరకు చేర్చింది. నా ప్రాణం ఎవరి చేతిలో ఉందో అతని సాక్షి! నా ప్రభువు దీనికంటే ఎక్కువ తన దాసులను ప్రేమిస్తాడు. ఆ పిల్లలను గూట్లోపెట్టు.

15. గుర్తుంచుకోవాల్సిన విషయం

ముస్లిములైనా, ముస్లిమేతరులైనా అందరూ అల్లాహ్ దాసులే.

ఒక్కసారి ఆలోచించండి!

అల్లాహ్ అందరినీ రక్షిస్తుంటాడు. కాని వారికి ఆ సంగతి తెలీదు.

వారు చీకటిలో ప్రమాదపుటంచుల్లో నడుస్తున్నా అల్లాహ్ వారికి జీవితం ప్రసాదించినంతకాలం రక్షిస్తూనే ఉంటాడు.

మరో లోకం విషయానికివస్తే... ప్రవక్తల ద్వారా జీవిత విధానాలను నేర్పడం జరిగింది. మంచి పనులు చేయండని ఆదేశించబడింది. చెడుపనులకు దూరంగా ఉండమని వారించబడింది. అల్లాహ్‌కు సహవర్తులను చేర్చకండని బోధించబడింది. ఎవరయితే ఈ బోధనలకు అనుగుణంగా జీవితం గడుపుతారో అల్లాహ్ వారిని క్షమించి వదిలిపెడతాడు. ఎవరయితే ఈ బోధనలకు అనుగుణంగా జీవితం గడుపుతారో వారు మరణించిన తర్వాత వారిని క్షమించి వదిలిపెట్టాలో లేదా శిక్షించాలో అల్లాహ్‌పై ఆధారపడి ఉంది.

కాని ఇక్కడ ఒక్క విషయం చాలా స్పష్టంగా వివరించబడింది: అదేమిటంటే- అబద్ధం, దొంగతనం, మోసం వంటివాటిని అల్లాహ్ తలిస్తే క్షమిస్తాడు. కాని అల్లాహ్‌కు సహవర్తులను కల్పిస్తే ఆ పాపాన్ని అల్లాహ్ ఎన్నటికీ క్షమించడు.

16. పరిహాసం

ముహమ్మద్ (స)కు తన తండ్రి ఆస్తిలో వారసత్వంగా ధనంతోపాటు సేవచేసే ఒక బానిస స్త్రీ కూడా లభించింది.

ఆమె ప్రవక్త (స)కు పసితనంలో పాలుపట్టారు కూడా. ఆమె ఎవరో మీకు తెలుసనుకుంటా?

ఆమె పేరు 'ఉమ్మె అయ్‌మన్.' ప్రవక్త (స) బ్రతికున్నంత కాలం ఆమె కూడా బ్రతికున్నారు.

ప్రవక్త (స) పెరిగి పెద్దవారయ్యారు. అల్లాహ్ ఆయన (స)ను తన ప్రవక్తగా ఎన్నుకున్నాడు. ఒకరోజు ఉమ్మె అయ్‌మన్ ప్రవక్త (స) సన్నిధికి వచ్చారు. ప్రవక్త (స)కు ఆమె పాలుపట్టారు కనుక ప్రవక్త (స) ఆమెను చాలా గౌరవంగా చూశారు. సకల మర్యాదలు చేశారు.

ఆ తర్వాత ఉమ్మె అయ్‌మన్ ప్రవక్తతో; 'ఓ ప్రవక్తా! నాకు ఒక ఒంటె ఇవ్వండి' అని విన్నవించుకున్నారు.

ప్రవక్త (స) 'ఒంటె పిల్లను అయితే ఇస్తా' అని అన్నారు. అందుకు ఉమ్మె అయ్‌మన్ 'ఒంటె పిల్లను తీసుకుని నేనేం చేయను?' అన్నారు.

అప్పుడు ప్రవక్త (స) 'ప్రతి ఒంటె, మొదట ఒంటెపిల్లే కదా! అవుతుంది' అని పరిహసించారు. అదివిని ఆమె నవ్వుకుని సంతోషంతో వెళ్ళిపోయారు.

17. స్వర్గంలో వింత వ్యవసాయం

ఒకసారి ప్రవక్త (స) ఆయన సహచరులు అందరూ కలిసి ఒకచోట సమావేశమయ్యారు.

ప్రవక్త (స) అందరికీ ఇలా హితోపదేశం చేస్తున్నారు: "స్వర్గంలో ప్రవేశించిన వ్యక్తికి ఏం కావాలంటే అవి దొరుకుతాయి. తినే వస్తువులు, త్రాగే వస్తువులు, ఫలాలు కావాలనుకునే వారికి ఫలాలు, వంటకాలు తినాలనిపిస్తే ఘుమఘుమలాడే వంటకాలు, నోరూరించే మిఠాయిలు, పక్షుల మాంసం తినాలనిపిస్తే పక్షుల మాంసం- ఒక్క మాటలో చెప్పాలంటే అక్కడ దొరకని వస్తువేదీ ఉండదు.

స్వర్గంలో ఒక వ్యక్తి అల్లాహ్‌ను 'ఓ అల్లాహ్! నాకు వ్యవసాయం చేయాలనుంది. అది మామూలు వ్యవసాయం కాదు... ఒకవైపు నేను విత్తనాలు నాటుతుంటే, మరోవైపు అవి మొలకెత్తుతూ ఉండాలి. గోధుమలేస్తే అవి అప్పటికప్పుడే గోధుమలుగా, వరి వేస్తే వరిగా, ఏ వస్తువు నాటినా అవి వెంటనే మొలకెత్తాలి' అని విన్నవించుకున్నాడు.

అప్పుడు అల్లాహ్ ఇలా అంటాడు: 'ఇప్పటికీ నీ మనసు వ్యవసాయంలో సంతృప్తి చెందలేదా! సరే వ్యవసాయం చేసుకో'... ఆ వ్యక్తి ఒకవైపు విత్తనాలు నాటుతుంటే మరోవైపు అవి అప్పటికప్పుడు మొలకెత్తుతుంటాయి.

ఆ సమావేశంలోనే కూర్చుని ఉన్న అమాయకుడైన ఒక గ్రామస్థుడు, 'ఓ ప్రవక్తా! వ్యవసాయం చేయడం ఖురైషీలకు, అన్సారులకే వచ్చు. మాకు వ్యవసాయం చేయడం రాదు కదా! మరి మేము స్వర్గంలో వ్యవసాయం చేయడం ఎలా'? అని అమాయకంగా అడిగాడు. అతని వింత ప్రశ్నకు అక్కడ కూర్చున్నవారందరూ ఫకాలున నవ్వేశారు.

18. మంచి విషయాలు ఇతరులకూ నేర్పండి

ఒకనాటి విషయం. ప్రవక్త (స) ఇంటి నుండి బయలుదేరి మస్జిద్‌కు వెళ్ళారు.

కొందరు వ్యక్తులు మస్జిద్‌లో ఒక మూలన తలవంచుకుని కూర్చుని దైవధ్యానం చేసుకుంటున్నారు.

మరోమూల ఇంకొందరు వ్యక్తులు ప్రజలకు మంచి విషయాలు నేర్పుతున్నారు. వారికి హితబోధ చేస్తున్నారు.

అప్పుడు ప్రవక్త (స) 'నేను అల్లాహ్ తరఫు నుండి నేర్పడానికి బోధించడానికి వచ్చాను' అని మంచి విషయాలు నేర్పించే వారి వద్దకు వెళ్ళికూర్చున్నారు.

ప్రవక్త (స) అక్కడ కూర్చున్న వారందరికీ మంచి విషయాలు నేర్పారు. తన అనుచరులకు అన్ని విషయాలు బోధించారు. ఇతరులతో ఎలా మాట్లాడాలి, ఎలా నడచుకోవాలి, తన వారితో ఎలా మెలగాలి, పొరుగువారి పట్ల ఎలా వ్యవహరించాలి, నమాజ్ ఎలా చేయాలి, రోజా ఎలా ఉండాలి, హజ్ ఎలా చేయాలి, జకాత్ ఎలా ఇవ్వాలి, వివాహం ఎలా చేసుకోవాలి.

ఆయన (స) ప్రాపంచిక విషయాలూ చెప్పారు, పరలోక విషయాలూ నేర్పించారు.

పగ గురించి చెప్పారు. ప్రేమ గురించి వివరించారు. రణనీతిని నేర్పారు, శాంతి ప్రబోధనలూ చేశారు. రాత్రి నమాజుల గురించి చెప్పారు, పగటి నమాజులూ వివరించారు. ఔషధాల గురించీ చెప్పారు, ఆరాధనల గురించీ తెలిపారు. ప్రవక్త (స)పై, ఆయన కుటుంబం వారిపై శాంతికురియుగాక!

19. మనసు మార్చుకున్న మొరటోడు...!

ప్రవక్త (స) ముస్లిములను, ముస్లిమేతరులను ఎప్పుడూ వేరుగా చూడలేదు. ఆయన వద్దకు ఎవరొచ్చినా వారిని ఆయన (స) అతిథిగా భావించేవారు. ఇంట్లో ఒక్కపూటకు సరిపడే అన్నం ఉన్నాసరే వచ్చిన అతిథులకే పెట్టేవారు. తాను తన కుటుంబ సభ్యులు పస్తులు గడిపేవారు. ప్రవక్త (స) సతీమణులు కూడా అలాంటివారే. తాము తినకుండా ఇతరులకు పెట్టేవారు.

ఒకసారి ప్రవక్త (స) దగ్గరకు ఒక అతిథి వచ్చాడు. అతను ముస్లిమేతరుడు. ప్రవక్త (స) అతనికోసం మేకపాలు తెచ్చారు. అతను పాలను పూర్తిగా ఆరగించాడు. ప్రవక్త (స) రెండో మేకపాలు తెచ్చారు. అతను అవికూడా పూర్తిగా తాగేశాడు. చెబితే మీకు నవ్వొస్తుంది.... అప్పటికీ అతని కడుపు నిండలేదు. మూడో మేకపాలు, నాలుగో మేక పాలు ...... ఇలా అతను మొత్తం ఏడు మేకలపాలు దిట్టంగా లాగించేశాడు.

అతని ఈ వింత ప్రవర్తనకు ప్రవక్త (స) ఏమాత్రం విసుగు ప్రదర్శించలేదు. ప్రవక్త (స) మంచితనం చూసిన ఆ వ్యక్తి ఉదయాన్నే కలిమా పఠించి ముస్లిం అయ్యాడు.

మేము మీకు ముందే వివరించాము- ప్రవక్త (స) సతీమణులు కూడా తమ ఇంటికి ఎవరైనా అతిథులు వస్తే సంతోషపడేవారు. 'అతిథులు వస్తే ఇంట్లో అన్నీ అయిపోతాయి, మనం ఆకలితో అలమటించాల్సి వస్తుంది' అని ఏమాత్రం విచారించేవారు కారు.

20. అందరూ సమానులే

ఒకసారి ప్రవక్త (స) ఆయన అనుచరులతో కలిసి ఎక్కడికో ప్రయాణమై బయలుదేరారు. వెళ్ళేటప్పుడు తినడానికి వెంట ఏమీ తీసు కెళ్ళలేదు. కొంతదూరం వెళ్ళాక వారికి ఆకలేసింది. దాంతో వారందరూ కలిసి అన్నం వండుకోవటానికి నిర్ణయించుకున్నారు.

తలాఒకపని చేయడానికి పూనుకున్నారు. ఒకరు కర్రలు తీసుకు రావడానికి వెళ్ళారు. ఇంకొకరు జిబహ్ చేయసాగారు. మరొకరు వంట టానికి పాత్రలు శుభ్రం చేయసాగారు. ఇంకొకరు పొయ్యి వెలిగించారు. ఇలా ఒక్కొక్కరు ఒక్కోపని చేయసాగారు.

ప్రవక్త (స) కూడా అడివికెళ్ళి ఎండుకట్టెలు తెచ్చేందుకు పూను కున్నారు. కాని ఆయన పనిచేయడం సహచరులకు నచ్చలేదు. 'మీరు ఏ పనీ చేయడానికి వీల్లేదు, ఈ పనులు చేయడానికి మేమున్నాం కదా!' అన్నారు.

కాని ప్రవక్త (స) ఇలా అన్నారు: 'నిజమే, కాని మీ అందరికీ పెద్దవాడినై పనిచేయకుండా కూర్చోవడం పద్ధతి కాదు. ప్రజలకు నాయ కుడైన మనిషి పని చేయకుండా కూర్చోవటాన్ని అల్లాహ్ అస్సలు ఇష్ట పడడు.'

ప్రవక్త (స) తన ఇంటి పని తానే స్వయంగా చేసుకునేవారు. చినిగిన బట్టలను తనే కుట్టుకునేవారు. పశువుల పాలు పితికేవారు. ఇంటికి కావాల్సిన సరుకులు తెచ్చేవారు.

వీధిలో ఓ కటిక పేదవాడు అనారోగ్యంగా ఉన్నా వెళ్ళి అతన్ని పరామర్శించేవారు. ఓదార్చేవారు. పేదవారింటికి వెళితే వాళ్ళతోపాటే కూర్చునేవారు. అందరూ కలిసి కూర్చున్నచోటికి వెళితే ఎక్కడ స్థలం దొరికితే అక్కడే కూర్చునేవారు.

ఒకసారి ప్రవక్త (స) అనుచరుల్లో ఒకరు: 'ఓ ప్రవక్తా! మాలో అందరికంటే ఉత్తములైన వారి కుమారుడా!' అని సంబోధించాడు.

అప్పుడు ప్రవక్త (స) 'అలా అనకండి, నేను అబ్దుల్లాహ్ కుమారుడిని, దైవదాసుడిని, దైవప్రవక్తను మాత్రమే, దీనికంటే ఎక్కువ స్థానాన్ని నాకు అంటగట్టకండి, మీరు నన్ను ఇంతకంటే ఎక్కువగా చేసి చూపడం నాకు అస్సలు ఇష్టం ఉండదు' అన్నారు.

తన ప్రియ సతీమణి ఆయిషా (రజి.అన్హా)తో ప్రవక్త (స) ఇలా అంటుండేవారు:

'ఆయిషా! పేదలను ప్రేమించు. ఇంటికి వచ్చిన అనాధలను ఒట్టి చేతుల్తో తిప్పిపంపకు. ఇంట్లో తినడానికి ఒక ఖర్జూరపు ముక్క ఉన్నా అది వారికి ఇవ్వు.'

21. ప్రవక్త (స)గారి పితామహులు

ముహమ్మద్ (స)గారి పితామహుని పేరు ఇబ్రాహీం అలైహి స్సలాం. ఇబ్రాహీం (అలైహి) తండ్రి ఒక శిల్పి. ఆయన రాళ్ళను చెక్కి విగ్రహాలుగా తయారు చేసేవాడు. రాళ్ళకు కాళ్ళు, చేతులు, కళ్ళు, ముక్కు, చెవులు చెక్కి వాటిని అందమైన విగ్రహాలుగా మలిచేవాడు. వాటిని చూసిన ప్రతి ఒక్కరూ మంత్ర ముగ్ధులై అలానే చూస్తుండి పోయేవారు.

ఇబ్రాహీం (అలైహి) తండ్రి పేరు ఆజర్. ప్రస్తుతకాలంలో చిత్రకారులకు ఎంత విలువ ఉందో ఆకాలంలో ఆయనకు కూడా అంతే విలువ ఉండేది. అందరూ ఆయన్ను 'విగ్రహ శిల్పి ఆజర్' అని పిలిచేవారు. ఆయన ఆ వృత్తిలో బాగా పేరు ప్రఖ్యాతలు సంపా దించాడు.

తన తండ్రి రాళ్ళు చెక్కడం, రాళ్ళను విగ్రహాలుగా మల చడం ఇబ్రాహీం (అలైహి) గమనించేవారు. మనుషులు వాటి ముందు సాష్టాంగపడటం కూడా ఆయన చూసేవారు. కానీ, ఆ విషయం ఇబ్రాహీం (అ)కి బోధపడేదికాదు.

ఇబ్రాహీమ్ (అ)గారి నగరవాసులు తమకు ఏమైనా అవస రాలు వస్తే విగ్రహాల ముందు తలవంచుకుని నిలబడి కడు విన యంగా 'మేము అనారోగ్యానికి గురయ్యాము, మమ్మల్ని ఆరోగ్య వంతుల్ని చెయ్యండి. మేము బీదవారము. మమ్మల్ని ధనవంతుల్ని చెయ్యండి, మేము ఆకలితో ఉన్నాము. మాకు అన్నపానీయాలు ప్రసాదించండి' అని వేడుకునేవారు.

ఈ విషయాలేవి ఇబ్రాహీం (అలైహి) బుర్రకెక్కేవికావు. ఏమిటీ ఈ తమాషా? తమ చేతుల్తో తయారు చేసుకున్న వస్తువు లను ఆరాధించడమేంటి? అని ఆశ్చర్యపోయేవారు.

ఒకరోజు ఆయన దృష్టి ఆకాశం వైపు మళ్ళింది. దానిపై ఉన్న నక్షత్రాలను చూశారు. వాటి ప్రకాశాన్ని చూసి ఇవి కాంతి వంతంగా ఉన్నాయి. బహుశా వీటిని ఆరాధించాలేమో! అను కున్నారు. ఆ తర్వాత ఆయన చంద్రుణ్ణీ, దానికాంతినీ చూసి; కాదు, కాదు! నక్షత్రాల కాంతి కంటే దీనికాంతి ఎక్కువగా ఉంది. బహుశా చంద్రుణ్ణి ఆరాధించాలేమో! అనుకున్నారు. ఆ రాత్రంతా ఆయన 'నక్షత్రాలను ఆరాధించాలా? చంద్రుణ్ణి ఆరాధించాలా?' అని ఆలోచిస్తునే ఉన్నారు.

తెల్లవారింది. ఆకాశంలో సూర్యుడు తళతళామెరుస్తూ కనిపించాడు. దాని వెలుగు చూపుల్ని చెదరగొడ్తుంది. సూర్యుణ్ణి చూడాలంటే చాలా కష్టం. అందుకని ఆయన 'ఇతనే మా అతిపెద్ద దేవుడేమో! అనుకున్నారు. కానీ, సాయంత్రం సూర్యుడు అస్తమించగానే... మాయమయ్యే ఏ వస్తువూ దేవుడు కాజాలదు' అని ఎలుగెత్తి చాటారు.

కొన్ని వందల సంవత్సరాలు గడిచిపోయాయి. హజ్రత్ ఇబ్రాహీం (అలైహి) పరమపదించారు. ఆయన (అ) నిర్మించిన చిరస్మరణీయమైన కాబా గృహాన్ని సుదూర ప్రాంతాల నుండి ప్రజలు తండోపతండాలుగా తరలివచ్చి ఇప్పటికీ దర్శించుకుంటున్నారు. దాని నలువైపులా ప్రదక్షిణలు చేస్తున్నారు. దాని గోడలను చుంబిస్తున్నారు. కానీ!! ఇబ్రాహీం (అలైహి) అల్లాహ్‌ను ఎలా గుర్తించారో ఎవరూ ఆలోచించడం లేదు.

ముహమ్మద్ (స) తన పితామహుని మాటలు విన్నారు. మరి ముహమ్మద్ (స) ఏం చేశారో తెలుసుకుందామా...?

22. ప్రవక్త (స) ఔన్నత్యం

మక్కాకు మూడు మైళ్ళదూరంలో ఒక గుహ ఉంది. దానిని 'హిరాగుహ' అని అంటారు.

ముహమ్మద్ (స) తెగవారు, నగరవాసులు కూడా విగ్రహారాధనే చేసేవారు. ముహమ్మద్ (స)కు అది తప్పుగా అనిపించేది.

ఆయన (స) హిరాగుహకు వెళ్ళేవారు. వెళ్ళేటప్పుడు అన్నం తీసుకెళ్ళేవారు. అక్కడే దూరంగా వెళ్ళి కూర్చునేవారు. తల దించుకుని ఆలోచించేవారు. అన్నం అయిపోతే మళ్ళీ వెళ్ళి అన్నం తెచ్చుకునేవారు. బాగా ఆలోచించేవారు. ఆయన (స) ఏం ఆలోచించేవారు....?

ఈ చల్లటి గాలులు, వేడి గాలులు, పండ్లు ఫలాలు, జీవితం తరగడం, పెరగడం, కష్టసుఖాలు ఇవన్నీ ఎలా జరుగుతున్నాయి?

ఏ విషయాలను నమ్మాలి? ఏవి నమ్మకూడదు. నీళ్ళతో నిండి వున్న నదులు, ఎత్తయిన పర్వతాలు, మబ్బులు, పిడుగులు ఎలా వచ్చాయి? ఎందుకు వచ్చాయి?

ప్రవక్త (స) నిద్రపోయినప్పుడు ఆయనకు కలలో ఏం కనిపిస్తుందో మేల్కొన్న తర్వాత ఆ విషయాలు అచ్చం అలానే జరిగేవి.

జరిగే విషయాలు ఎవరో నిద్రలో ముందుగానే తెలుపుతున్నట్లు అనిపించేది ఆయన (స)కు.

ఆయన అల్లాహ్ ప్రవక్త అయ్యేందుకు తొలి సూచనలవి.

23. చీపురుకట్ట కథ (కల్పిత కథ)

ఒక రోజు జరిగిన విషయం. మా చెల్లెలు సల్మాముందు చీపురు పుల్లలు చిందర వందరగా పడివున్నాయి. ప్రక్కనే మా చిన్న బాబు ఆ చీపురు పుల్లలతో ఆడుకుంటున్నాడు. చీపురులో నుంచి ఒక పుల్ల తీశాడు, పారేశాడు. ఇంకో పుల్ల తీశాడు అదీపారేశాడు. వెంటనే మరోపుల్ల తీశాడు. దాన్ని తుంచేశాడు. చీపురు నిస్సహా యంగా పడివుంది. తన దైనరీతిలో రోదిస్తూ ఉంది. కాని దాని రోదన ఎవరికీ వినబడటం లేదు. నేను దానితో ఇలా అన్నాను, చీపురీ! నువ్వు ఇంట్లో ఎటుతిరిగినా అక్కడి పరిసరాలను పరిశుభ్రం చేస్తుం టావు. దుమ్మూ ధూళి, చెత్తాచెదారం అంతా నీముందు దిగ దుడుపే. ఇప్పుడు నీకేమయింది. చిన్నపిల్లాడు నిన్ను చేత్తో తీసిపారే స్తున్నాడు. ఏడ్చి రోదించడం తప్ప ఏం చేయలేకపోతున్నావు.

అప్పుడు చీపురి, ఏడుపువల్ల వస్తున్న ఎక్కిళ్ళను బలవంతంగా ఆపుకుంటూ 'నాకు కట్టబడి ఉన్నతాడు తెగిపోయింది. ఇప్పుడు ప్రతిపుల్లా నానుండి వేరయిపోయింది. తాడు తెగిపోయే సరికి నేను బలహీనురాలినయ్యాను. నా ధైర్యం సడలిపోయింది. తాడుకట్టి ఉన్నంతవరకు నన్నెవరూ ఏమీ చేయలేరు. పెద్దపెద్ద వారికి నాపై చెయ్యేసే ధైర్యం ఉండదు. ఆ తాడు తెగిపోగానే గాలి నన్ను చిందర వందర చేస్తుంది. పిచ్చుకలు, పావురాళ్ళు తమ పంజాలతో నన్ను రక్కుతాయి. ఒడిసిపట్టుకుని తీసుకెళ్ళి నన్ను తమ గూళ్ళల్లో బంధిస్తాయి.

అటుచూడు! కొత్త ముడులతో మరోకొత్త చీపురు వస్తుంది. దాని ముడిబంధం చాలా గట్టిగా ఉంది. నన్ను ఒక్క ఉదుటున ఊడ్చిపారేస్తుంది. నేను చెత్తయి నాశనమయి పోతాను" అంటూ ఏడ్చింది.

అప్పుడు నేనన్నాను; చీపురూ! నేను చెప్పేది శ్రద్ధగా విను! అల్లాహ్ ఆదేశాలను గట్టిగా పట్టుకోకుండా విడనాడుతూ తమకు ఇష్టం వచ్చినట్లు చేసేవారి పరిస్థితి కూడా ఇలానే అవుతుంది. అలాంటి వారిని మానవులు చిందరవందర చేసేస్తారు. విరి చేస్తారు. అవమానం పాలుజేస్తారు. వారిని సమాజం నుడి తరిమే స్తారు. అయినా వారి కళ్ళు తెరుచుకోవు. వారికి బుద్ధికూడారాదు.